క్లుప్తంగా

మంత్రి కాకాణిని కలిసిన సర్పంచ్



ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ సుబ్బమ్మ

పొదలకూరు: జిల్లాస్థాయిలో పురస్కారం దక్కించుకున్న మండలంలోని పులికల్లు సర్పంచ్ జీవీ సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధవి గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని సన్మానించి ఆయన చేతులమీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. మంత్రి సహకారంతోనే తమ పంచాయతీకి జిల్లాస్థాయిలో అవార్డు లభించిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, నాయకులు వై.పెంచలరెడ్డి, జి.నారాయణరెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి సంతాపం



వెంకటాచలం: కడపలోని నిర్మలా కళాశాల విద్యార్థిని శ్వేత ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన క్రమంలో వెంకటాచలం మండలం కాకుటూరులోని వీఎస్‌యూలో ఆంధ్రా విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆమెకు నివాళులర్పించారు. విద్యార్థిని శ్వేత చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థి సంఘం నాయకుడు తురకా ప్రసాద్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అవసరం

ఇందుకూరుపేట: క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అవసరమని వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి పేర్కొన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యకమంలో భాగంగా మండలంలోని మైపాడు పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారిణి క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి పలు ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణశాఖ పర్యవేక్షకులు సుధాకర్‌రెడ్డి, జావీద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో 'గడప గడపకు..'

పొదలకూరు: మండలంలోని నందివాయ, అయ్యగారిపాళెం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ నగేష్‌కుమారి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించడంతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

నిడిగుంటపాళెంలో ప్రచార భేరి

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోగుల శ్రీనివాసులు, ఓడూరు వెంకటకృష్ణయ్య, ముంగర చెంచురామయ్య, పాట్టిపాళెం సుధాకర్, తుమ్మతాటి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో క్యాంపస్ ఎంపికలు



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను గురువారం నిర్వహించారు. బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులతో పాటు వివిధ డిగ్రీలు పొందిన 600 మంది హాజరుకాగా, 150 మందిని ఎంపిక చేశారు. టెక్ మహేంద్ర సాఫ్ట్‌వేర్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ మేనేజర్ షబీనా కంపెనీ ప్రతినిధిగా హాజరయ్యారు. కరస్పాండెంట్ శ్రీనాథ్‌రెడ్డి, సీఈఓ రాజాయాదవ్, హెచ్‌ఆర్ ప్రతినిధి ఫణిపూజిత్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజయ్‌వేలు, ప్రిన్సిపల్ సోనాలి మన్నా, వైస్ ప్రిన్సిపల్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాలనపై ప్రజలు సంతృప్తి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వృద్ధురాలికి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు నూరు శాతం సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నేలటూరు పంచాయతీలో రెండో రోజు గురువారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఇంటింటికీ తిరిగి ఆరా తీశారు. ఎస్సీకాలనీలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను వంచించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. పింఛన్లు, నిత్యావసర సరుకులను నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేరవేయడం వంటి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకాల అమలులో మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.

డిసెంబర్ నాటికి ఫిషింగ్ జెట్టీ

ఈ ప్రాంతంలో రూ.25 కోట్లతో తలపెట్టిన ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి సంబంధించి సర్వే పూర్తి చేసి, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి కాకాణి తెలిపారు. డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకొన్న ఎస్సీకాలనీని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. స్థానికుల అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకొని స్థల సేకరణ, కాలనీ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, ఈపూరు కోటారెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చీకిరి శీనమ్మ, ఎంవీ పాళెం సర్పంచ్ మునుకూరు జనార్దన్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు వికాస పథకంతో అన్నదాతకు సహకారం

• డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



రైతులకు రుణాల చెక్కులు అందజేస్తున్న చలపతిరావు

కొడవలూరు: రైతు వికాస పథకం ద్వారా రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. రైతు వికాస పథకం ద్వారా గుండాలమ్మపాళెం సొసైటీ పరిధిలో మంజూరైన రూ.30 లక్షల రుణాల చెక్కులను మండలంలోని నార్తురాజుపాళెం వీసీఆర్ అతిథి గృహంలో గురువారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటివరకు రూ.10 కోట్లకు పైగా దీర్ఘ, స్వల్ప కాలిక రుణాలను రైతులకు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతులకు సొసైటీల ద్వారా విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించేలా చర్యలు తీసుకొంటోందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ అనికేపల్లి కృష్ణప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాల మద్యం కలిగి ఉంటే శిక్షార్హులు



కార్మికులకు సూచనలిస్తున్న ఎస్ఈబీ సీఐ నరహరి

కొడవలూరు: పొరుగు రాష్ట్రాల మద్యం కలిగి ఉంటే శిక్షార్హులవుతారని కోవూరు ఎస్ఈబీ సీఐ ఆర్.నరహరి హెచ్చరించారు. మండలంలోని రాచర్లపాడు సీమెన్స్ గమేసా ఫ్యాక్టరీలోని కార్మికులు, సిబ్బందికి నిషేధిత మత్తు పదార్థాలతో అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులున్నందున ఈ విషయాన్ని గుర్తించుకోవాలని, గంజాయి కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసులు, తులసి, కార్మికులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ దిలీప్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహించాలని ఎంఈఓ దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం సోషల్ ఆడిట్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో అమలవుతున్న నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, క్లాస్ బెస్ట్ అసైన్‌మెంట్ పరీక్షల వివరాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ఈ నెల 29వ తేదీ లోపు సోషల్ ఆడిట్ నిర్వహించి ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు ఇస్మాయిల్, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

సైడ్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన



మాట్లాడుతున్న కౌన్సిలర్ ప్రత్యూష తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక 3వ వార్డులో సైడ్ కాలువ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అందె ప్రత్యూష మాట్లాడుతూ ఇటీవల తమ ప్రాంతంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా పర్యటించినప్పుడు వార్డు ప్రజలు సైడ్ కాలువను నిర్మించాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని కోరారని, స్పందించిన ఆయన సచివాలయాల ద్వారా వచ్చిన రూ.20 లక్షలతో సైడ్ కాలువ నిర్మించుకోవాలని ఆదేశించారని తెలిపారు. నిధులతో వార్డులోని పాలడిపో వీధిలో సైడ్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పాకాల చెరువుకట్టకు మరమ్మతులు



సీఎం, కాకాణి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

మనుబోలు: పొలాలకు వెళ్లేందుకు దారి లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న జట్ల కొండూరు గ్రామ రైతులు తమ సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతగా గురువారం ఆ గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇన్నేళ్లుగా ఎవరూ తమ సమస్యను పరిష్కరించకపోవడంతో రైతులు తమ ఇబ్బందులను మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఇరిగేషన్‌శాఖ అధికారులతో మాట్లాడి సుమారు రూ.25 లక్షలతో చెరువు కట్ట పనులు చేయించారు. దీంతో ప్రస్తుతం రైతులు ధాన్యం, ఎరువులు పొలాల్లో నుంచి నేరుగా తెచ్చుకునేందుకు చెరువు కట్ట మీదుగా దారి ఏర్పడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం ఆధ్వర్యంలో గురువారం సీఎం, కాకాణి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని వినతి

నెల్లూరు (వేదాయపాళెం): ఆస్తిని తీసుకొని తనపై దౌర్జన్యం చేస్తున్న కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని నవాబుపేటకు చెందిన పద్మమ్మ కోరారు. సుబేదారుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన గోడును వెళ్లబోసుకున్నారు. మైపాడు గేట్ సెంటర్‌లోని శ్రీనివాసనగర్‌లో తన కష్టార్జితంతో సంపాదించుకున్న 32 అంకణాల స్థలంలో నివసిస్తున్నానని చెప్పారు. భర్త మృతి చెందడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్నానన్నారు. తన కుమారుడు, కుమార్తెకు వివాహాలు చేసి ఆస్తులను పంచానని చెప్పారు. తాను ఉంటున్న ఇంటి స్థలాన్ని సైతం తనకు ఇవ్వాలంటూ కుమారుడు, కోడలు దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. స్థలానికి డూప్లికేట్ డాక్యుమెంట్లను సృష్టించి తనను బయటకు గెంటేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఉపరాష్ట్రపతిని కలిసిన దువ్వూరు



వెంకయ్యనాయుడుతో మాట్లాడుతున్న నాయకులు

ఇందుకూరుపేట: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, నాయకుడు దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కలిసిన వారు పలు అంశాలపై ఆయనతో చర్చించారు. వీరి వెంట ఆక్వా సొసైటీ డైరెక్టర్ పామంజి నరసింహ, మైపాడు శివాలయం చైర్మన్ కసుపూరు సురేంద్రబాబు, నరసాపురం సర్పంచ్ తాత సురేంద్ర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీహరికోట ప్రసాద్, గంపల సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, నాగరాజు, నరేంద్ర తదితరులు ఉన్నారు.

దుస్తుల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గురువారం దాతలు దుస్తులు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామిక వేత్త కొలన్ రాజారెడ్డి – పూజిత దంపతులు సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో వసంతోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. దత్తాత్రేయ అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ప్రాకారోత్సవాన్ని రాత్రి నిర్వహించారు. ఉభయకర్తగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

సరస్వతీదేవిగా మహాలక్ష్మి



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక వసంత పరిమళ కొలాయి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, పద్మ, సుబ్బారావు, అనూష దంపతులు వ్యవహరించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసురేష్, రవి, నరేంద్రప్రసాద్, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.

మహిళపై దాడి కేసులో ఐదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్): మద్యం మత్తులో మహిళపై దాడి చేసి గాయపర్చిన కేసులో నేరం రుజువు కావడంతో తోటపల్లిగూడూరు మండలం పాత కోడూరుకు చెందిన వెంకటేశ్వర్లుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1700 జరిమానా విధిస్తూ 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తోటపల్లిగూడూరు మండలం పాతకోడూరుకు చెందిన సుగుణమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నారు. 2017, నవంబర్ 27న రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు మద్యం మత్తులో ఆమె ఇంటికెళ్లి తలుపు తట్టారు. అనంతరం అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె వారించారు. దీంతో కోపంతో ఆమె తలపై కర్రతో కొట్టి గాయపర్చి పారిపోయాడు. చికిత్స నిమిత్తం ఆమెను నెల్లూరులోని ఆస్పత్రికి కుమారుడు జయప్రకాష్ తరలించారు. సుగుణమ్మ ఫిర్యాదు మేరకు తోటపల్లిగూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితుడిపై చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ప్రసాద్ కేసు వాదించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

కోవూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ జాతీయ స్థాయిలో రాణించాలని, తాము చదువుతున్న పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని డీపీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రిలో స్కూల్ గేమ్స్‌లో భాగంగా రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి 14 మంది పాల్గొనగా వారిలో 12 మంది బాలికలు కోవూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులని తెలిపారు. వీరంతా ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, రజత పతకాలు సాధించారన్నారు. భవిష్యత్‌లో వీరు జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే స్మాష్ రాకెట్ క్రీడలో ఇటీవల జైపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు మహిళల విభాగంలో 3వ స్థానం, పురుషుల విభాగంలో 4వ స్థానంలో నిలిచారని తెలిపారు. అనంతరం క్రీడాకారులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.నరసింహమూర్తి, విశ్రాంత పీఈటీ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ ఎం.దేవిక, పీఈటీ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సికిందర్

కోవూరు: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కోవూరు టీఎన్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారని ఆ కళాశాల ప్రిన్సిపల్ సికిందర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం ఆయన ఆ కళాశాలలో అభినందించారు. సీనియర్ ఎంపీసీలో ఆర్.ప్రదీప్‌కుమార్ 934, సీఈసీ విభాగంలో ఎస్‌వీ హేమంత్ 883, జూనియర్ ఎంపీసీలో గౌరీ 435, సీఈసీలో 409 మార్కులు సాధించారన్నారు. తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అభినందించారు.

విద్యార్థుల సత్తా

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఎంపీసీ ఫలితాల్లో బి.ప్రభాస్ 917, బైపీసీలో బి.ఝాన్సీ 858, సీఈసీలో సీహెచ్ శ్రీమిత 853, ఓఏలో మేఘశ్యామ్ 801 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో ఒ.పావని 391, బైపీసీలో ఎస్.అనుష్క 358, సీఈసీలో ఎ.ఆమని 425, ఓఏలో ఎస్కే జమీర్ 461 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.



బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థిని షేక్ అర్షియాను అభినందిస్తున్న దృశ్యం

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఆక్టోపస్ డీఐజీ రాజశేఖర్ అన్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక సిద్ధార్థ కళాశాల విద్యార్థులను గురువారం స్థానిక రైన్‌బో పాఠశాలలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణా కూడా చాలా అవసరమని, విద్యార్థులు ఏ పాఠ్యాంశాన్నైనా ప్రణాళికాబద్ధంగా, క్రమశిక్షణతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. అనంతరం 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని అర్షియాను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విద్యాసాగర్, అధ్యాపకులు రామకృష్ణ బీవీ రమణయ్య పాల్గొన్నారు.

అధిక మోతాదులో పురుగుమందుల వాడకం వద్దు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి

• జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి



సదస్సుకు హాజరైన రైతులు

పొదలకూరు: నిమ్మతోటల యాజమాన్య పద్ధతుల్లో రైతులు అధిక మోతాదులో పురుగుమందులను వాడవద్దని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి సూచించారు. 'వేసవి కాలంలో నిమ్మసాగు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు'పై స్థానిక వ్యవసాయశాయ పరిశోధనా స్థానంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుబ్బారెడ్డి మాట్లాడుతూ తోటల్లో చిన్నపాటి తెగుళ్లు వస్తే రైతులు ఆందోళన చెంది పురుగుమందులను పిచికారీ చేయకూడదని, ప్రతి ఏడాది నిమ్మతోటల్లో పచ్చిరొట్ట ఎరువులను వేస్తే వేరుకుళ్లు తెగుళ్లు వ్యాప్తి చెందవని తెలిపారు. నిమ్మలో అంతర పంటల సాగు చేయవద్దని, మిర్చి, టమాటా, వంకాయ తదితర అంతర పంటల వల్ల నిమ్మ చెట్లు దెబ్బతింటాయని తెలిపారు. జీవనియంత్రణ ఎరువుల వాడకం వల్ల పనికొచ్చే బ్యాక్టీరియా ఉండేదన్నారు. ఇపుడు పైపాటుగా జీవనియంత్రణ ఎరువులను వేయాల్సి వస్తున్నట్లు తెలిపారు. ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్, వేపపిండి, పశువుల ఎరువులను కలియబెట్టి నిమ్మచెట్టు పాదిలో వేస్తే చెట్టు ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. వేసవిలో తోటల్లో తేమశాతం ఉండేలంటే ప్రతి రైతు డ్రిప్ పద్ధతిని పాటించాలని సూచించారు. పెట్లూరు నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త కవిత మాట్లాడుతూ అధికంగా పురుగుమందులను వాడకూడదన్నారు. శాస్త్రవేత్తలు, ఉద్యానాధికారుల సలహాలు, సూచనలు పాటించి తెగుళ్లకు మందులను పిచికారీ చేయాలని సూచించారు. ఏపీఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రిప్ ద్వారా ఎరువులను పంపి ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. సదస్సులో పెట్లూరు శాస్త్రవేత్త శాంతానాయక్, ఉద్యానాధికారి ఈ.ఆనంద్ రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన



కోవూరు: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందని డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, పడుగుపాడు ఉప సర్పంచ్ ఎస్కే అహమ్మద్ పేర్కొన్నారు. మండలంలోని పడుగుపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని, ప్రజలే స్వచ్ఛందంగా తమ వద్దకు వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక తామంతా సంతోషంగా ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు పర్వీన్, వార్డు సభ్యులు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.